క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 18, క్యాబేజీ 13, క్యారెట్ 28, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 65, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 35, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జైలు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుపడ్డ పలువురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్ కొమురయ్య వివరాల ప్రకారం.. మంగళవారం చేపట్టిన తనిఖీల్లో మద్యం తాగి పట్టుబడిన 11 మందిని నాంపల్లిలోని 10 మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చగా మొదటి సారి పట్టుపడ్డ ముగ్గురికి రెండు రోజుల జైలు, రూ.2100 జరిమానా, రెండో సారి పట్టుపడ్డ 8 మందికి నాలుగు రోజులు రూ.3300 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెళ్లడించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

రాంగోపాల్‌పేట్: గణపతి నిమజ్జనానికి తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు రాహుల్ స్వగత్, విజయ్ శర్మ, నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్చ్, లైటింగ్ ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. శోభాయాత్ర సాగే మార్గంలో వేదికలు ఏర్పాటు చేసి గణనాథులకు స్వాగతం పలుకుతామని, వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌నాథ్, అర్జున్, యాదగిరి పాల్గొన్నారు.

విరాళం అందజేత

సనత్‌నగర్: హైదరాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్, మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మణిదీప్ మంగళవారం ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకుని రూ. 50 వేల నగదు విరాళాన్ని అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం


బోడ విజయలక్ష్మీ

ఉస్మానియా యూనివర్సిటీ: జంతుశాస్త్రంలో బోడ విజయలక్ష్మీ కి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకురాలు ప్రొ.వనితదాస్ పర్యవేక్షణలో ఐసోలేషన్ ఐడెంటిఫికేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ మైతిడోగైని స్పిసిస్ అసోసియేటెడ్ విత్ సోర్గమ్ బై కలర్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

లాలాపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గణేష్ ముదిరాజ్ అన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో గణేష్ ముదిరాజ్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తాన్ని దానం చేసే వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వారవుతారని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయాలన్నారు.

మూడో అంతస్తు నుంచి పడి కూలి మృతి

అడ్డగుట్ట: మూడవ అంతస్తు నుంచి కిందపడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం.. అడ్డగుట్ట బీ-సెక్షన్‌కు చెందిన జ్ఞానేశ్వర్ (28) ఈ నెల 26న లోహియా నగర్‌లోని ఓ భవనంలో మూడవ అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చైన్ స్నాచింగ్

రాంగోపాల్‌పేట్: బస్సు ఎక్కేందుకు వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రామంతాపూర్‌కు చెందిన మా. దవి బాలంరాయి ప్రాంతంలోని ఓ దేవాలయానికి గురుద్వారా దగ్గర బస్సు దిగి ఒలిఫెంటా బ్రిడ్జి అవతలి వైపునకు నడుచుకుంటూ వెళ్తోంది. ఇదే సమయంలో ఒలిఫెంటా బ్రిడ్జి ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆమె మె డలోని ఐదున్నర తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో రూ.1400 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట ఎస్‌బీటీనగర్ వీకర్ సెక్షన్‌లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను రూ.10 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు ప్రకటించారు. బేగంపేట పాటిగడ్డలో రూ.5.90 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. బేగంపేట పాటిగడ్డ ప్రాంతంలో రెండు కళ్లలా హిందూ, ముస్లింలు నివాసముంటారని ఇరువురికి ఈ ఫంక్షన్ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కేవలం రూ.15 వేలకే శుభకార్యాలు చేసుకోవచ్చని టెంట్‌హౌస్ సామగ్రి, గ్రైండర్, మిక్సీ వంటి వాటికి అదనంగా ఖర్చు లేకుండా తానే కొనుగోలు చేసి అందుబాటులో ఉంచనున్నట్లు మంత్రి చెప్పారు. పాటిగడ్డ ప్రాంతం వర్షాకాలం వచ్చిందంటే ఒకప్పుడు నడవడానికి ఇబ్బందికర పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సిమెంట్ రోడ్లతో పాటు డ్రైనేజీ, మంచి నీటి పైప్‌లైన్లను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఎస్‌బీటీనగర్ వీకర్ సెక్షన్ ఇళ్ల పునరుద్ధరణ కోసం కార్పొరేటర్, స్థానిక నాయకులను ఇంటింటికి పంపించి వివరాలు సేకరించామని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే ధనియాలగుట్ట శ్మశానవాటికను ఎంతో అభివృద్ధి చేసామని వర్షాలు పడినప్పుడు అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ తదితర లోతట్టు ప్రాంతాల పరిస్థితి ఎలా ఉండేదో అందరికీ తెలుసునని, ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో వరద ముంపు సమస్య పరిష్కారానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, తలసాని సాయికిరణ్‌యాదవ్, జోనల్ కమిషనర్ రవికిరణ్, కార్పొరేటర్లు టి.మహేశ్వరిశ్రీహరి, కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి, నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, అక్బర్, అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు..

బన్సీలాల్‌పేట్/రాంగోపాల్‌పేట్: గణేష్‌నిమజ్జనోత్సవానికి ప్రభుత్వం తరఫున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులు, నాయకులతో కలిసి సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో నిమజ్జనోత్సవ శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో పర్యటించారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు, రోడ్లపై గుంతలున్న చోట మరమ్మతులు చేయాలన్నారు. నిమజ్జనోత్సవం కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. నిఘానేత్రలో పోలీసు శాఖ భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాట్లు చేసిందన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించబోం

అమీర్‌పేట: ప్రజలను ఇబ్బందులు కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. అమీర్‌పేట డివిజన్‌లో మంగళవారం ఆయన రూ.1.07 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యపై స్పందించి అపార్ట్‌మెంట్ ఎదుట అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. బాపూనగర్‌కు చెందిన ఓ వ్యక్తి నాలుగు నెలలు గడుస్తున్నా కల్యాణ లక్ష్మి రాలేదని వాపోగా సంబంధిత మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. బల్కంపేట వ్యాయామశాల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. శేషుకుమారి, జోనల్ కమిషనర్ వెంకటేష్, ఈఈ ఇందిర, హరిశంకర్, మోహన్, వంశీ, నర్సింహ, లలితా చౌహాన్, నరేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి..

రాంగోపాల్‌పేట్: పేద ప్రజల సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి తలసాని పేర్కొన్నారు. మంగళవారం సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయంలో సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారులకు ఆయన కలెక్టర్ అనురూప్ దురిశెట్టితో కలిసి పట్టాలు, దివ్యాంగులకు పెంచిన పింఛన్‌కు సంబంధించిన పత్రాలను అందజేశారు.

ఉపాధి శిక్షణా కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంరెడ్డి

రాంగోపాల్‌పేట్: చదువుతో పాటు కంప్యూటర్, ఆంగ్ల పరిజ్ఞానం ఉంటేనే మంచి అవకాశాలు వస్తాయని ఈజీఎంఎం తెలంగాణ రాష్ట్ర మేనేజర్ రాంరెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో మైఖేల్ సుసాన్ డెల్ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్-ఎక్స్ డిజిటల్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో ఉద్యోగాలు సాధించాలంటే ఉన్నత చదువుతో పాటు పలు రంగాల్లో నైపుణ్యం ఉండాలన్నారు. మైఖేల్ సుసాన్ డెల్ ఫౌండేషన్ లాంటి పెద్ద సంస్థలు సీఎస్‌ఆర్‌లో భాగంగా నిరుద్యోగులకు ఉచితంగా నైపుణ్యాల్లో శిక్షణిచ్చి, ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సిటీ మేనేజర్ కరుణాకర్ మాట్లాడుతూ.. మైఖేల్ సుసాన్ డెల్ ఫౌండేషన్ సహకారంతో ఈ శిక్షణా కేంద్రంలో ఏడాదికి 1350 మంది నిరుద్యోగులకు ఉచితంగా లైఫ్ స్కిల్స్ శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంజద్ హుస్సేన్, వికాస్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాంధీ కాంట్రాక్టు నర్సుల సమ్మె


ధర్నా చేస్తున్న నర్సులు

గాంధీఆస్పత్రి: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కాంట్రాక్టు నర్సుల సమ్మె మూడవ రోజూ కొనసాగింది. ఆస్పత్రి ప్రాంగణంలో బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా నిర్వహించారు. కొంతమంది మంగళవారం వైద్య మంత్రి హరీష్‌రావును కలిసేందుకు క్యాంపు కార్యాలయానికి వెళ్లగా, ఆయన అందుబాటులో లేరని, స్పష్టమైన హామీ ఇచ్చే వరకు విధుల బహిష్కరణ కొనసాగుతుందని నర్సింగ్ సిబ్బంది స్పష్టం చేశారు. కాంట్రాక్టు నర్సుల సమ్మెతో నిరుపేద రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు.

సన్నాహక సదస్సును జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఇనుముల నరసయ్య

బౌద్ధనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం నేడు జరగబోయే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఇనుముల నరసయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధించడమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 నుంచి నవంబర్ 4వ వరకు అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నారని తెలిపారు. ముగింపు సభగా హైదరాబాద్‌లో లక్షల మందితో 'విశ్వరూప మహాసభ ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ విజయవంతానికి బుధవారం (నేడు) షాద్‌నగర్‌లోని ఏవీ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న సన్నాహక రాష్ట్ర సదస్సులో మందకృష్ణ మాదిగ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ నాయకులు డప్పు మల్లికార్జున్, సామ్యూల్, ఎంఎంఎస్ నాయకులు జేపీ. లత, సురారం సుజాత, గజ్జల రాజశేఖర్, టీవీ నరసింహ, శ్యాంసన్, నర్సింగ్‌రావు, దశరథ్, యాదగిరి పాల్గొన్నారు.

సీసీఎంబీ ఓపెన్ డేలో విద్యార్థుల సందడి


విద్యార్థులకు పరిశోధన అంశాలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

లాలాపేట: తార్నాకలోని సీఎస్‌ఐఆర్-సీసీఎంబీలో మంగళవారం నిర్వహించిన సీఎస్‌ఐఆర్ 82వ వ్యవస్థాపక దినోత్సవంలో నగరంలో వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన దాదాపు ఏడువేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. సీసీఎంబీలోని పరిశోధనశాలలను విద్యార్థులు తిలకించడంతో పాటు శాస్త్రవేత్తలతో అక్కడ జరుగుతున్న పరిశోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పరమాణు జీవశాస్త్ర పద్ధతులు, జన్యు సంబంధిత అంటువ్యాధులు ఏ విధంగా సోకుతాయి వాటి నివారణకు తీసుకోవాల్సిన అంశాలను తెలిపే ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సైన్స్ పట్ల ఆసక్తిని కల్గించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి


శ్యామల మృతదేహం

సనత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ వివరాల ప్రకారం..మూసాపేట సమీపంలోని జింకలవాడ బస్తీలో నర్సింహులు, శ్యామల (55) దంపతులు నివాసముంటున్నారు. నర్సింహులు మేస్త్రీగా పనిచేస్తుంటాడు. మంగళవారం ఇంట్లో శ్యామల మృతి చెంది పడి ఉండటాన్ని గమనించిన స్థానికుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే వరకు భర్త నర్సింహులు కూడా ఇంట్లోనే ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మెడపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భర్త హత్య చేశాడా.. లేక శ్యామల గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: డివిజన్ వ్యాప్తంగా అవసరమున్న అన్ని బస్తీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీతాఫల్‌మండి, శ్రీనివాస్‌నగర్‌లలో నూతన పైప్‌లైన్లను వినాయక నిమజ్జనం అనంతరం ప్రారంభిస్తారన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు కూడా మంజూరైందని దాదాపు రెండు కోట్లు వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీతాఫల్‌మండి డివిజన్ అభివృద్ధిలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్, నవ్య, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను సన్మానించిన ఆంజనేయగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులు కష్టపడి చదవాలని..ఇష్టపడి ఆడాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా. ఆంజనేయగౌడ్ అన్నారు. ఇటీవల హన్మకొండలో జరిగిన 67వ రాష్ట్ర స్కూల్‌గేమ్ ఫెడరేషన్ క్రీడల్లో సైక్లింగ్ వెలోడ్రమ్ రెజ్లింగ్ అకాడమీ క్రీడాకారుల పోటీలలో బంగారు పతకాలు సాధించిన ఆకాష్ (51వ కేజీల విభాగం), శివసంపత్(110 కిలోలు), ఎన్.సతీష్ (65 కేజీలు)ను మంగళవారం ఓయూ క్యాంపస్ సైక్లింగ్ వెలోడ్రమ్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, ధనలక్ష్మీ, రవీందర్, ఓఎస్‌డీ నర్సయ్య, మనోహర్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం


ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న లాస్యనందిత

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల చర్యలను నిరసిస్తూ బరిగీసి కొట్లాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ జీవితం నేటి మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాకలోని మర్రికృష్ణా ఫంక్షన్ హాల్లో రాష్ట్ర రజక మహిళా సంఘం అధ్యక్షురాలు మల్లేశ్వరపు రాజేశ్వరీ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అలుపెరుగనీ పోరాటం చేసి తన భూమిలో పండించిన పంటలను సాధించడమే కాకుండా ఇంకా పది మందికి సహాయం చేయాలనే ఆలోచనతో మడమతిప్పని ఉద్యమం చేసి చరిత్రపుటంలో చెరుగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్ నాగేశ్వర్‌రెడ్డి, పోచయ్య యాదవ్, శారదా మల్లేష్ పాల్గొన్నారు.

ధీరవనిత చాకలి ఐలమ్మ

రసూల్‌పురా: భూస్వామ్య, జమీందారి దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని లాస్య నందిత అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకుని మడ్‌ఫోర్ట్ దోబీ ఘాట్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి మంగళవారం ఆమె నివాళులర్పించి మాట్లాడారు. విస్నూర్ దేశ్‌ముఖ్ జమీందర్ రాంచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేసి ఈ భూమినాది, పండించిన పంట నాది.. తీసుకెళ్లడానికి దొరెవ్వడు అంటూ తన మాటలను తూటాలుగా మల్చుకుని తెలంగాణ రైతాంగ పోరాటానికి ఆమె నాంది పలికారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సదానంద్, సత్యనారాయణ, శంకర్, కృష్ణ, బీంరావు, సోమయ్య, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.



తార్నాక డివిజన్ లాలాపేట పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. శ్రీపురికాలనీ, చంద్రబాబునగర్ తదితర బస్తీలో రోడ్లపై ఇష్టానుసారంగా చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. పేరుకుపోయిన చెత్త లోంచి దోమలు, ఈగలు విజృంభించి రోగాల బారిన పడేస్తున్నాయని సంబంధిత అధికారులు ఈ ప్రాంతాలపై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

–లాలాపేట


బేగంపేట మాతాజీనగర్ గణనాథుడి పూజలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్


అమీర్‌పేటలోని వినాయకుడిని దర్శించుకున్న మర్రి శశిధర్‌రెడ్డి


బౌద్ధనగర్‌లోని గణేశ్ మండపంలో పూజలు నిర్వహించిన ఆదం విజయ్‌కుమార్

జై బోలో.. గణేష్ మహరాజ్‌కీ..

గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో డప్పు వాయిద్యాలు, యువత కేరింతల నడుమ నిమజ్జనలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లోని మండపాలను పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్న భజన, సంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంటోంది.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం


ప్రత్యేక పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా


క్రాంతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ..


చంద్రబాబునగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


పూజలు చేస్తున్న చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ మట్టంరాజు


నామాలగుండు వినాయక మండపంలో ..


అన్నదాన కార్యక్రమంలో.. దర్గా సుఖేందర్ రెడ్డి


లాలాపేటలో..


ఆదిత్యనగర్ మండపంలో..


బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో..

